జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ మేలు

- 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం
- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో 200 మంది చేరిక


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు


కృష్ణా కాలనీలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


గొల్లలపాలెం మెయిన్‌రోడ్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


గొల్లలపాలెంలో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులందరికీ మేలు జరిగిందని, అన్ని వర్గాల ప్రజలూ లబ్ధి పొందారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి సమీపంలోని గొల్లలపాలెం, కృష్ణా కాలనీ ప్రాంతాల్లో జీవీఎంసీ 3వ వార్డు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కోండ్రు రామసూరప్పడు, జనరల్ కార్యదర్శి పిన్నింటి ఎర్రయ్యరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ నెరవేర్చారన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా అధికారంలోకి వచ్చిన వెంటనే ఎవరూ ఊహించని విధంగా జగనన్న హామీలు అమలు చేసి చూపించారన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే పాలన అందించన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి చేకూరిందని, గతంలో జన్మభూమి కమిటీల ద్వారా భారీ స్థాయిలో దోచుకున్నారని విమర్శించారు. గత ఐదేళ్లలో ఎన్నో మంచి పనులు చేయడం వల్లే... ప్రజలందరికీ మేలు జరిగితేనే ఓటు వేయండని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధైర్యంగా ప్రచారం చేయగలుగుతున్నారన్నారు. చెప్పుకోవడానికి ఏమీ లేకే చంద్రబాబు అన్ని పార్టీలనూ కలుపుకుని వస్తున్నారని, ఎంత మంది కలిసొచ్చినా వైఎస్సార్ సీపీని, సీఎం జగన్‌ను ఏమీ చేయలేరన్నారు. ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

గొల్లలపాలెం, కృష్ణాకాలనీ ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేనకు చెందిన 200 మంది కోండ్రు రామసూర్పడు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని కోరారు. నాయకులు వియ్యపు ధనరాజ్, వియ్యపు గోవింద్, ఆవాల చిట్టిబాబు, గుడ్డాల సురేష్, వియ్యపు నర్సింగ్, కోండ్రు సాయి, జిబ్బిడి అప్పలరాజు, వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజీ, జి.మధునాయుడు, చీకటి ఊర్మిళ పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

17 నామినేషన్ల ఆమోదం


అభ్యర్థుల నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గానికి సంబంధించి 17 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. ఎన్నికల నిర్వహణ అధికారి, ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం నామినేషన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకే అభ్యర్థి అదనంగా దాఖలు చేసిన నామినేషన్లను తీసివేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేయగా ఆయన భార్య ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి కూడా నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుతోపాటు ఆయన కుమారుడు గంటా రవితేజ, కాంగ్రెస్ అభ్యర్థి అడ్డాల వెంకట వర్మరాజుతోపాటు ఆయన భార్య అడ్డాల స్వప్న నామినేషన్లు దాఖలు చేశారు. ఆయా పార్టీల అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందడంతో వారికి డమ్మీగా వేసిన ముగ్గురి నామినేషన్లు తీసివేశారు. వీరితోపాటు బహుజన సమాజ్ పార్టీ, జై భారత్ నేషనల్ పార్టీ, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, జాతీయ జనసేన పార్టీ, ప్రజా ప్రస్థానం పార్టీ, సమాజ్‌వాదీ పార్టీల అభ్యర్థులతోపాటు, అయిదుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. కాగా 29న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం చివరగా బరిలో ఎంతమంది నిలుస్తారో తేలనుంది.

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని అర్చకులు ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ హరీష్

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. చిన్నబజారు ప్రాంతంలోని బస్టాప్ వద్ద దీన్ని ఎస్ఐ హరీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ వేసవిలో బాటసారులు సేద తీరేందుకు చలివేంద్రం ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: చిట్టివలస 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో దాకమర్రి రూరల్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా టి.నగరపాలెం, శింగనబంద, మజ్జివలస, లక్ష్మీపురం, నారాయణరాజుపేట పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

223 మందికి వైద్య పరీక్షలు


ఆరోగ్య శిబిరంలో చిన్నారి నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో శుక్రవారం 223 మందికి పీహెచ్‌సీ వైద్యులు వైద్యసేవలు అందించారు. శిబిరాన్ని ఎంపీడీవో అప్పలనాయుడు సందర్శించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి గంగునాయుడు మాట్లాడుతూ శిబిరాల్లో గుర్తించిన వ్యాధులకు అవసరమైతే రిఫరల్ ఆస్పత్రుల ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. ప్రత్యేక వైద్యులు ప్రవీణ్‌వర్మ, దిలీప్‌కృష్ణ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.15 వేల జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన వారికి న్యాయస్థానం జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల జాతీయ రహదారిపై నిర్వహించిన తనిఖీల్లో ఏడుగురిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం కోర్టు ముందు హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.2 వేలు నుంచి రూ.3 వేలు చొప్పున మొత్తం 15 వేల రూపాయలు జరిమానా న్యాయమూర్తి విధించారని ఎస్ఐ తెలిపారు.

ఎన్నికలప్పుడు వచ్చే వలస పక్షులను నమ్మొద్దు


కృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


టీడీపీ నాయకులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక


విజయరాంపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

కొమ్మాది: రాజకీయం పేరుతో వ్యాపారం చేసే వలస పక్షుల్లాంటి నాయకులను నమ్మి మోసపోవద్దని కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీ ప్రియాంక అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది దరి కె1, కె2 కాలనీల్లో ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండే ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎమ్మెల్యే అయిన తర్వాత అనేక అభివృద్ధి పనులు నిర్వహించి మధురవాడ రూపురేఖలు మార్చారన్నారు. అనంతరం కె2 కాలనీకి చెందిన పద్మ అనే మహిళ నాయకురాలు, ఆమె అనుచరులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. రెండు రోజుల క్రితం వీరు టీడీపీలో చేరగా... అక్కడ టీడీపీ సిద్ధాంతాలు నచ్చక మరలా శుక్రవారం సాయంత్రం కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, గాదె రోశిరెడ్డి, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, సియాద్రి కనకరాజు, ఎస్.పైడిరాజు, వరలక్ష్మి, జె.శివ, పిల్లా రమణ, అవతార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా ఇంటింటికీ ప్రచారం

పద్మనాభం: గ్రామాల్లో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేశారు. గత ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. విశాఖపట్నం ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని, భీమునిపట్నం ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని అభ్యర్థించారు. కృష్ణాపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొలె అప్పలనాయుడు, సుంకర నారాయణరావు, గాడు అప్పలరాజు, విజయరాంపురంలో వాజిగాని పైడినాయుడు, సుంకర పైడినాయుడు ప్రచారం నిర్వహించారు.

అడ్డంగా డివైడర్ దాటుతూ... ప్రమాదకర ప్రయాణం

- మహరాజుపేట ఫ్లై ఓవర్ వరకు భయంకరంగా రాకపోకలు
- డివైడర్‌కు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు


రాకపోకల కోసం అవంతి కళాశాల ఎదురుగా ద్విచక్రవాహనదారులు తవ్వేసిన డివైడర్


సమయం కలిసొస్తుందని ప్రమాదకరంగా డివైడర్ దాటుతున్న దివీస్ ఉద్యోగులు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా 250 మీటర్ల దూరం కలిగిన డివైడర్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. గోస్తనీనదిపై వంతెన నుంచి మహరాజుపేట ఫ్లై ఓవర్ వరకు విస్తరించిన ఈ డివైడర్‌పై అత్యవసరంగా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తగరపువలస నుంచి భీమిలి గ్రామీణ మండలానికి చేరుకోవడానికి మహరాజుపేట ఫ్లై ఓవర్ కింద నుంచి రాకపోకలు సాగించాల్సి వుంది. అయితే 200 మీటర్ల దూరం కలిసొస్తుందని కక్కుర్తి పడిన ద్విచక్ర వాహనదారులు డివైడర్‌ను పలుచోట్ల విరగ్గొట్టి రాకపోకలకు మార్గం చేసుకున్నారు. ఇంకా కొన్ని చోట్ల డివైడర్‌కు సమాన ఎత్తులో రెండు వైపులా రాళ్లు పెట్టుకుని వాటి సాయంతో ద్విచక్ర వాహనాలతో రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా దాటేటప్పుడు ఇరువైపులా జాతీయ రహదారిపై 60 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో రాకపోకలు సాగించే భారీ వాహనాలు ఢీకొట్టి ప్రమాదాలకు గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రాణాలు పోగొట్టుకున్న ప్రమాదకరమైన ప్రదేశమది. ఇక్కడ సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడంతో భారీ వాహనాల యజమానులు ప్రమాదం జరిగిన తర్వాత క్లెయిమ్ చేసుకుంటే వారు చట్టం నుంచి సులువుగా తప్పించుకోవచ్చు. ఫలితంగా డివైడర్ దాటి ప్రమాదానికి గురైనా ద్విచక్ర వాహనదారులకు బీమా కూడా వర్తించదని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు.

ఉద్యోగులే అడ్డదారిలో రాకపోకలు

డివైడర్ మధ్య నుంచి మార్గం చేసుకుని అడ్డదిడ్డంగా రాకపోకలు సాగించే వారిలో అత్యధికులు విద్యావంతులు, ఉద్యోగులే వుంటున్నారు. ముఖ్యంగా చిప్పాడ దివీస్ లేబొరేటరీలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు సంస్థ లోపలే భద్రత నియమాలు పాటిస్తారని, బయట పాటించరన్న విషయం ఇక్కడి డివైడర్ వద్ద పరిశీలిస్తే తెలుస్తుంది. ఇక్కడ చుట్టూ తిరిగి వస్తే 200 మీటర్ల దూరం ఎక్కువ వస్తుందని భావించిన ఆ సంస్థ ఉద్యోగులు రోజూ వందల సంఖ్యలో ఈ డివైడర్‌ను అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో దాటుతుంటారు. దివీస్ సంస్థలోనే కాకుండా చుట్టుపక్కల పరిశ్రమలు, విద్యాసంస్థల్లో భద్రతపై ఉపన్యాసాలు దంచే అక్కడి భద్రతాధికారులు తమ ఉద్యోగులు రహదారులపై ఎలా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారో చూడాలని పలువురు కోరుతున్నారు. లేదా తమ ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామాల పౌరుల ప్రాణాల రక్షణకు దివీస్ లేబొరేటరీ తన సీఎస్ఆర్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ 250 మీటర్ల డివైడర్ పొడవునా రెయిలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని కోరుతున్నారు.


ప్రమాదం అంచున మరో దివీస్ ఉద్యోగి


నిర్లక్ష్యంగా డివైడర్ దాటుతున్న తాటితూరు వాసి


డివైడర్ పైనుంచి ద్విచక్ర వాహనాన్ని దాటిస్తున్న తగరపువలస యువకులు

విశాఖపై ప్రేముంటే వైఎస్సార్ సీపీని బలపరచండి

- సీఎం జగన్ పాలనలోనే నగర అభివృద్ధి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


పిలకవానిపాలెంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు గుమ్మడికాయలతో దిష్టి తీస్తున్న మహిళలు


కార్‌షెడ్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా నాయకులు, అభిమానులు


కూరగాయల వ్యాపారికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: విశాఖ నగరంపై ప్రేమ ఉన్నవారు, ఇక్కడి నీరు తాగి, గాలి పీల్చేవారంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు పాత పీఎంపాలెం, పిలకవానిపాలెం పరిసర ప్రాంతాల్లో ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రం అందజేసి గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని వివరించారు. భీమిలితోపాటు విశాఖ పరిసర ప్రాంతాలు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ద్వారానే అభివృద్ధి చెందుతున్నాయన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం, ఆరు లైన్ల కారిడార్ రోడ్, అదాని డేటా సెంటర్‌తోపాటు ఐటీ, ఫార్మా అన్ని రంగాల్లో విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఎన్నికల తర్వాత విశాఖలోనే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని, విశాఖ పరిపాలన రాజధాని అవుతుందన్నారు. తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. తనతోపాటు ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మహిళలు పోతిన లక్ష్మి, పరమేశ్వరి ఆధ్వర్యంలో నాయకులకు 2 డజన్ల గుమ్మడి కాయలతో అడుగడుగునా దిష్టి తీసి, విశేషంగా హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో వివిధ విభాగాల నాయకులు ఎస్.నాగభూషణరావు, హరివెంకట సత్యనారాయణ, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, వంకాయల మారుతీప్రసాద్, నాగోతి తాతారావు, పోతిన శేషుబాబు, పీతల అప్పలరాజు, పోతిన తిరుమల దీపక్, మనోజ్‌కుమార్, తొత్తడి సుబ్బు, పిల్లా సురేష్, జగ్గుపిల్లి సురేష్, పీస అప్పలరాజు, పసుపులేటి గోపి, పోతిన గురునాథ్, పిల్లా శ్రీను, బాయిన రాము, పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురవాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సువిశాల వాతావరణంలో, అధునాతన తరగతి గదులు, ఆట స్థలం, డిజిటల్ బోర్డులు, తదితర వసతులతో బక్కన్నపాలెం నవోదయ స్కూలు వెనుక కళాశాల ఉందని చెప్పారు.

ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని, నిష్ణాతులైన అధ్యాపకులు, ల్యాబొరేటరీ వున్నాయని చెప్పారు. ఈ ఏడాది ఇంటర్‌లో 18 మంది అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98498 83416, 95504 92036లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కృష్ణవేణి కోరారు.


మధురవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల